

నోయిడా ఫిలిం ఫెస్టివల్‌కు 'ఎకోస్'

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అవార్డులు సాధించిన డాక్యుమెంటరీ ఫిలింమేకర్ వినోద్‌రాజేంద్ర రూపొందించిన లఘుచిత్రం 'ఎకోస్' నోయిడా ఫిలింఫెస్టివల్‌కు ఎంపికైంది. సంగీత దర్శకుడు గగన్ బగేరియా ఎకోస్‌కు మ్యూజిక్ సమకూర్చారు. సాహిల్ అన్వర్, అనికేత్‌లు సౌండ్ ట్రాక్‌కు సహకారం అందించారు. మళయాళం పబ్లిసిటీ డిజైనర్ అర్జున్ డిజైన్ సమకూర్చగా రాజు సినిమాటోగ్రాఫర్‌గా ఉన్నారు. పది లఘుచిత్రాలకు దర్శకత్వం వహించిన వినోద్ 'ఎకోస్' చివరి షార్ట్‌ఫిలింగా ప్రకటించారు.



60 రోజులు అసాధ్యమా..!

- రోజురోజుకూ కుచించుకుపోతున్న శాసనసభ సమావేశాలు
- 42ఏళ్లలో ఓ ఏడాది మాత్రమే పరిపూర్ణం
- ప్రజాసమస్యలపై దృష్టి పెట్టని పాలకులు
- చర్చకు రాకుండా మిగిలినవి ఎన్నో..?

బెంగళూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలు రోజు రోజుకూ కుచించుకుపోతున్నాయి. శాసనసభ సమావేశాల ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం తెలుసుకునేందుకు వేదికగా ఉంటుందనేది నమ్మకం. శాసనసభ, విధానపరిషత్ సమావేశాల వేళ ప్రభుత్వ వైఫల్యాలు, నిర్లక్ష్యాన్ని స్పీకర్, సభాపతి ద్వారా ప్రభుత్వం దృష్టికి ప్రతిపక్షాలు తీసుకెళ్లాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన పరిష్కారం చూపాలి. వీటితోపాటు జీరో అవర్‌లో తాజా సంఘటనలు, పత్రికలలో వెలువడిన కథనాలను ప్రస్తావించేందుకు వీలుంటుంది. 69వ నిబంధన కింద సమగ్రంగా చర్చించేందుకు వీలుంటుంది. గతంలో పరిషత్‌లో అంశం ఏదైనా సుదీర్ఘంగా చర్చ సాగేది. పైగా నిష్ణాతులైన సభ్యులు ఉండేవారు. అధికార, ప్రతిపక్షం అనే తేడాలేకుండా కొందరు సభ్యులు అంశాలను ప్రస్తావిస్తే అవి భవిష్యత్తుకు మార్గదర్శకాలు అనేలా సాగేవి. ఇలా శాసనసభ సమావేశాలు ఏడాదికి 60 రోజులు కనీసంగా కొనసాగిస్తే సమస్యలు పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ఆ సమయాన్ని నిర్ణయించారు. ఏటా ఈ అంశంపై ఉభయసభల్లోనూ చర్చలు సాగుతాయి. అమలుకు మాత్రం నోచుకోవడం అంతంతమాత్రమే అనిపిస్తోంది. గడిచిన 42ఏళ్ల వ్యవధిలో 60రోజులు పూర్తిగా సమావేశాలు జరిగింది 2000 సంవత్సరంలో మాత్రమే.

పెరిగిన బడ్జెట్ గాత్రం

జనాభా, శాసనసభ్యుల సంఖ్య పెరిగినట్టుగానే బడ్జెట్‌గాత్రం కూడా పెరుగుతోంది. అయితే 7కోట్లమంది రాష్ట్రప్రజల ధ్వనిగా ఉండాల్సిన శాసనసభ కలాపాలు మాత్రం కుదించుకుపోతున్నాయి. 1952 నుంచి 1982 వరకు 1999 రోజులు కలాపాలు సాగాయి. దీన్నిబట్టి సరాసరిన 60రోజులు కొనసాగినట్లయ్యింది. ఆ తర్వాత 42ఏళ్లను పరిశీలిస్తే ఓ ఏడాది మినహా మరెన్నడూ 60రోజులు సమావేశాలు కొనసాగలేదు. ప్రస్తుతం 15 ప్రభుత్వాలు కొనసాగాయి. 16వ ప్రభుత్వం పాలన సాగిస్తోంది.

ప్రారంభంలో 99మంది ఎమ్మెల్యేలు

1952లో ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర జనాభా పెరుగుతూ వచ్చింది. అందుకు తగ్గట్టుగానే శాసనసభ్యులు పెరుగుతూ వచ్చారు. ఇటీవల దాదాపు రూ.4లక్షలకోట్ల దాకా బడ్జెట్ పెరుగుతోంది. అన్ని ఉన్నాయి. కానీ వాటిపై చర్చలకు శాసనసభ కలాపాలు మాత్రం సాగడం లేదు. కేవలం 99మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు మాత్రమే 65-85 రోజుల వరకు కలాపాలు కొనసాగాయి. అయితే శాసనసభ్యుల సంఖ్య 224కు పెరిగిన తర్వాత కలాపాల రోజులు తగ్గడం విచారం అనిపిస్తోంది. 1952లో 99మంది ఎమ్మెల్యేలతోపాటు ఓ నామినేటెడ్ సభ్యుడు ఉండేవారు. 1957లో ఎమ్మెల్యేల సంఖ్య 208కు పెరిగింది. 1967లో 216కు పెంచారు. 1978లో శాసనసభ్యుల సంఖ్య 224కు చేరింది. ఇటీవల 47ఏళ్లుగా శాసనసభ్యుల సంఖ్యలో ఎటువంటి మార్పు లేదు. ప్రారంభం నుంచి కూడా శాసనసభ కలాపాలకు నిర్దిష్టమైన రోజులు లేకున్నా రాష్ట్ర సంక్షేమం దృష్ట్యా నైతిక విలువలతో చర్చలు కొనసాగేవి.

ఏడాది	సమావేశాలు (రోజుల్లో)
2016	35
2017	40
2018	23
2019	15
2020	31
2021	40
2022	45
2023	39
2024	29

1971లో అత్యల్పంగా నాలుగు రోజులే..

శాసనసభ కలాపాలలో దశాబ్దాల కాలం పరిశీలిస్తే 1971లో కేవలం నాలుగు రోజులు మాత్రమే సమావేశాలు జరిగాయి. అంతకుముందు 1963లో రెండుసార్లు సమావేశాలు కొనసాగి ఏకంగా 98 రోజులపాటు శాసనసభ జరిగింది. సమావేశాలను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా 60రోజులు కొనసాగించేలా నిబంధన రూపొందించారు. కర్ణాటక రాష్ట్ర శాసనసభ ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణ నియమావళి 2002లో 60రోజులపాటు కొనసాగేలా తీర్మానించారు. అయితే బడ్జెట్ సమావేశాల వేళ జరిగిన సమావేశాలు మినహాయిస్తే తదుపరి వర్షాకాల, శీతాకాల సమావేశాలు కొనసాగలేదు. సాధారణంగా శాసనసభ సమావేశాలు ఏడాది ప్రారంభంలో గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమవుతాయి. అప్పుడు 15 రోజులు, బడ్జెట్ సమావేశాలు 20 రోజులు, వర్షాకాల సమావేశాలు 15 రోజులు, శీతాకాల సమావేశాలు 10రోజులు జరిపేలా నిబంధనలు విధించారు. శాసనసభ కలాపాలు మరిన్ని రోజులు పెంచాలనే డిమాండ్ ఏటా వస్తున్నా 60రోజులు పూర్తి కావడమే గగనంగా మారుతోంది.

పెరుగుతున్న ప్రతిపక్ష సభ్యుల సంఖ్య

1952 నుంచి 1982 వరకు 30ఏళ్ల వ్యవధిలో 1999 రోజులు సమావేశాలు కొనసాగాయి. ఈ వ్యవధిలో అధికార పార్టీ సభ్యులు మినహా ప్రతిపక్ష సభ్యుల సంఖ్య రెండంకెలకు చేరలేదు. అయితే రోజుల తరబడి ప్రజా సమస్యలపై చర్చలు కొనసాగేవి. అప్పట్లో అధికార పార్టీ సభ్యులమని ప్రభుత్వాన్ని వెనకేసుకొచ్చేవారు కాదు, ప్రజా సమస్యలపై నిలదీసేవారు. అర్థవంతమైన చర్చలతోపాటు సమగ్రత కొనసాగేది. సభలో దూషణలు, వ్యక్తిగతమైన ఆరోపణలు, అర్థంలేని ప్రసంగాలు, నినాదాలు, నిరసనలు అరుదుగా ఉండేవి. ఆ తర్వాత రాజకీయ పార్టీలు పెరిగాయి. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు కావడం, ప్రతిపక్షంలోనూ సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 2014-15లో సిద్దరామయ్య తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు 60రోజులు సమావేశాలు కొనసాగించారు. ఆ తర్వాత పదేళ్లలో సుమారు ఐదేళ్లు 50రోజుల సంఖ్య దాటలేకపోయింది.



అసెంబ్లీ సమావేశాలు (ఫైల్)

ప్రాణం తీసిన వేగం

- చెట్టును ఢీ కొన్న కారు.. ముగ్గురి దుర్మరణం
- విజయపుర జిల్లాలో ఘటన

బెంగళూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అతి వేగం ముగ్గురి ప్రాణంతీసింది. విజయపుర జిల్లాలో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. విజయపుర తాలూకాలో జాతీయ రహదారి 50 కన్నాళ క్రాస్ వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేక అదుపు తప్పడంతో కారు చెట్టును ఢీ కొంది. దీంతో కారు బోల్తా పడి ప్రమాదం జరిగింది. కారులో ఐదుగురు ఉండగా ముగ్గురు అక్కడిక్కక్కడే మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతి చెందిన వారిని అభిషేక్ సావంత్ (34), విజయకుమార్ ఔరంగాబాద్ (45), రాజు గణ్ణార (30)గా గుర్తించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాలను విజయపుర జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి విజయపుర గ్రామీణ కేసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



అభిషేక్ విజయకుమార్ రాజు(ఫైల్)



స్టాల్‌లో ఏపీ పెవిలియన్

సేంద్రియ మేళాలో ఆకట్టుకున్న ఏపీ స్టాల్

- ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక ప్రదర్శన
- సందర్శించిన కర్ణాటక వ్యవసాయ శాఖా మంత్రి చలువరాయస్వామి

7

మైక్రోఫైనాన్స్ నియంత్రణకు ప్రత్యేక ఆర్డినెన్స్

- నేడు సీఎం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం
- వేధింపులకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం



బెంగళూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మైక్రో ఫైనాన్స్ వేధింపులు పెరుగుతుండడంతో ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రామనగర, బెళగావి, బాగల్కోటె, బిజాపూర్‌జిల్లాలో ఇటీవల వారం రోజులుగా పలువురు మైక్రోఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకోవడం, మరికొందరు సొంతూళ్లు, కుటుంబ సభ్యులను వదిలి అజ్ఞాతంలోకి వదిలిపోయినటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. రామనగర జిల్లా మాగడి ప్రాంతానికి చెందిన ఓ మహిళ మైక్రోఫైనాన్స్ అప్పు తీర్చలేక కిడ్నీ విక్రయించిన అంశం వెలుగులోకి వచ్చింది. తాజాగా హావేరి జిల్లాలో మైక్రోఫైనాన్స్ సిబ్బంది వేధింపులు తట్టుకోలేక భర్త మృతి చెందాడు. ఈమేరకు భార్య తాళిబొట్టును ముఖ్యమంత్రికి పోస్టు చేశారనే విషయం శుక్రవారం హల్‌చల్ చేసింది. ఇలా నిరంతరంగా రాష్ట్రంలో మైక్రోఫైనాన్స్ వేధింపులు తీవ్రమయ్యాయి. చామరాజనగర జిల్లాలోని ఓ గ్రామంలో సుమారు పది కుటుంబాలకు చెందినవారు పల్లెను వీడి వెళ్లిపోయారు. వారి ఇళ్లు బోసిపోగా పంటపొలాలు బీడుగా మారాయి. ఇలాంటి వేధింపులను నియంత్రించేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. దీనిపై శనివారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరగనుంది. హోం మంత్రి పరమేశ్వర్, రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ సహా పలువురు పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పరేడ్‌కు పటిష్ట భద్రత..!

- గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం: నగర పోలీస్ కమిషనర్ దయానంద్



మీడియాతో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర పరేడ్‌కు పటిష్ట భద్రత చేపట్టినట్లు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ వెల్లడించారు. వేడుకలకు సంబంధించి బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్ మీడియాతో మాట్లాడుతూ పంజాబీ సైనికులతో భాంగ్రా జానపద నృత్యం, గట్కా సాంస్కృతిక కార్యక్రమం ఈ ఏడాది ప్రత్యేకమన్నారు. నగరంలోని మాణెక్ షా పరేడ్ మైదానం సర్వం సిద్ధమైంది. శుక్రవారం చివరి రిహార్సల్స్ ముగిశాయి. 76వ రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా ఆదివారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్నారు.కేరళ పోలీస్, రాష్ట్రానికి సంబంధించిన అన్ని రక్షకదళాలు, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, సేవాదళ్‌ల కవాతు ఉంటుందన్నారు. 650మంది విద్యార్థులచే అరివె అంబేడ్కర్ నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. నగర వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. పాస్‌లు ఉన్నవారికి మాత్రమే అనుమతులు ఉంటాయని, పర్స్, మొబైల్ మినహా ఇతరత్రా ఎటువంటి వస్తువులు అనుమతించబడవన్నారు.

రిహార్సల్స్





అన్నదాతకు ఏఐ అలర్ట్..!

- వ్యవసాయ రంగంలోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- వాతావరణం, నీరు, ఎరువులపై మొబైల్‌కు సమాచారం
- 'వెదర్ వాచ్'తో రైతులకు ఎన్నో ఉపయోగాలు
- కొప్పళ్ల జిల్లాలో విజయవంతం

బళ్లారి గాంధీనగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఇపుడు ప్రపంచమంతా 'ఏఐ' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీ మాట వినిపిస్తోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని రంగాల్లోనూ వినియోగిస్తున్నారు. ఇపుడు వ్యవసాయ రంగంలోనూ ఏఐ టెక్నాలజీ వాడుతున్నారు. రైతు తన పొలంలో చిన్నపాటి యంత్రాన్ని అమర్చుకుంటే చాలు పంటలకు ఎంత నీరు ఇవ్వాలి, ఎరువులు ఎలా వాడాలి, అసలు ఎరువులు అవసరమా లేదా..? రోగాల ప్రభావం ఎంత ఉంది, వాతావరణం ఎలా ఉంది వంటి సమాచారం రైతు మొబైల్‌కు వస్తుంది. పక్షం రోజుల వాతావరణ సమాచారం రైతులకు ముందుగానే తెలిసిపోతుంది. ఉద్యానవన పంటల సాగులో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విజ్ఞానంతో ఎంతో ఉపయోగంతో పాటు వ్యవసాయం వాతావరణంపై ఆధారపడి ఉంది. వాతావరణ మార్పుల కారణంగా దానిమ్మ, మామిడి, అరటి మొదలైన ఉద్యాన పంటలకు వ్యాధులు సోకుతాయి. దీనికి తోడు ఏ పంటలకు ఎప్పుడు, ఎంత నీరు ఇవ్వాలి, భవిష్యత్‌లో వాతావరణం ఎలా ఉంటుందో రైతులకు తెలియదు. అయితే ఏఐ పరిజ్ఞానంతో అవసరమైన మేరకే నీరు, ఎరువులు అందించవచ్చు. తెగుళ్లు, వ్యాధుల నివారణకు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు తమ పొలంలో 'వెదర్‌వాచ్' అనే చిన్న పాటి వాతావరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటే చాలు..ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం రైతులకు అందుతుంది. వాతావరణ గడియారాలు ప్రతిచోటా సులభంగా అందుబాటులో ఉన్నాయి. రైతుల పొలాల్లో సోలార్ ఆధారంగా పనిచేసే వెదర్ వాచ్‌ను ఏర్పాటు చేశారు. పంటల దగ్గర చిన్న పరికరాలను ఏర్పాటు చేస్తారు. ఇది మట్టితేమ, ఎరువుల అవసరాలపై ఎప్పటికపుడు రైతులకు సమాచారం చేరవేస్తుంది. వాతావరణ గడియారాన్ని సరఫరా చేసిన కంపెనీ సిఫార్సు చేసిన యాప్ ద్వారా రైతు తన మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి పంటతో సహా కొంత సమాచారాన్ని అప్‌డేట్ చేసే ఆ సమాచారం రైతుకు నిరంతరం అందుతూనే ఉంటుంది.

రాయితీ అందిస్తున్న ఉద్యానశాఖ

ముఖ్యంగా ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు ఇలాంటి విజ్ఞానాన్ని అందించేందుకు ఉద్యాన వన శాఖ రైతులకు రాయితీలు కల్పిస్తోంది. రైతులకు ఏఐ సాంకేతిక విజ్ఞానంతో కూడిన గడయారాలు ఏర్పాటుకు రైతులను ప్రోత్సహిస్తోంది. కొప్పళలో ఈ వినూత్న పథకం క్రింద 100 వాతావరణ వాచీలను ఏర్పాటు చేయాలని ఉద్యాన వన శాఖ నిర్ణయించింది. జిల్లాలో కొందరు రైతులు ఇప్పటికే తమ పొలాల్లో కొందరు వాతావరణ వాచ్‌లు అమర్చుకున్నారు. దీంతో సరైన సమాచారం పొందుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఈ వాతావరణాన్ని అనుసరించడానికి రైతులు ఉద్యానవన శాఖ సబ్సీడిని అందిస్తోంది. ప్రస్తుతం ఈ వాచ్ ధర మార్కెట్‌లో రూ 40వేల రూపాయలు ఉండగా, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతుకు రూ 20వేలకే తందిస్తోంది. ఇలా ఇరవై వేల రూపాయలు ఖర్చు చేస్తే రైతులు ఖర్చు చేస్తే రైతులు తమ పొలంలో వాతావరణ గడియారాన్ని అమర్చుకోవచ్చు. ఇందుకోసం ఉద్యాన వన శాఖకు దరఖాస్తు చేసుకుని సబ్సీడిని పొందవచ్చు. వ్యవసాయ రంగంలో కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు. ఈ విషయంలో రైతులు వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని వాటిని వినియోగించుకునేందుకు మొగ్గుచూపాల్సిన అవసరం ఉందని కొప్పళ ఉద్యానవన శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పొలంలో ఏర్పాటు చేసిన వెదర్ వాచ్



రైతు భాస్కర్

యాంత్రీకరణతో ఉత్పాదనరంగం ప్రగతి

- ఐదు దశాబ్దాల కిందటే గణనీయమైన ఖ్యాతి సాధించిన హెచ్‌ఎంటీ
- కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి

7

పరిటాల రవి ఘాట్ వద్దకు రకరకాల వంటకాలను తీసుకొస్తున్న కుటుంబసభ్యులు



నేటికీ అదే అభిమానం

ఘనంగా పరిటాల రవి 20వ వర్ధంతి

వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు

భర్తను తలుచుకుని పరిటాల సునీత కంటతడి

రామగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గతించి రెండు దశాబ్దాలు గడిచినా పరిటాల రవీంద్రపై అభిమానం ఏమాత్రం చెక్కు చెదరలేదు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించేందుకు అభిమానులు వెంకటాపురానికి పోటెత్తారు. మాజీమంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని వేలాది మంది అభిమానుల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, తనయులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వెంకటాపురంలోని ఘాట్ వద్దకు వచ్చి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అభిమానులు పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. పరిటాల రవీంద్ర చరిత్రను కీర్తిస్తూ నిర్వహించిన జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పరిటాల రవీంద్రఘాట్‌కు నివాళులర్పించిన వారిలో మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, కర్ణాటక మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, తెలంగాణ నుంచి వచ్చిన అభిమానులు ఉన్నారు. కార్యక్రమానికి వచ్చిన వారందరికీ అన్నదానం చేశారు.

వందేళ్ల తరువాత కూడా పరిటాల రవి పేరు చెప్పుకునేలా చేస్తాం: పరిటాల శ్రీరామ్

వందేళ్ల తరువాత కూడా పరిటాల రవిపేరు చెప్పుకునేలా తాము పని చేస్తామని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటా శ్రీరామ్ పేర్కొన్నారు. ఆయన మొదటి వర్ధంతి రోజు ఏ స్థాయిలో జనం వచ్చారో అదే స్థాయిలో నేడు కూడా ప్రజాభిమానం కనిపిస్తోందన్నారు. ప్రజాఉద్యమాలలో ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికి మరువలేమన్నారు. ఆయన కలలు, ఆశయాల కోసం పని చేస్తామన్నారు. మాకు తండ్రి లేని లోటు తీర్చిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం చివరి వరకు పనిచేస్తామన్నారు.

మడమ తిప్పని వ్యక్తి : బీకే పార్థసారథి, ఎంపీ, హిందూపురం

మాట ఇచ్చాడంటే మడమ తిప్పని వ్యక్తి పరిటాల రవీంద్ర అని ఎంపీ పార్థసారథి పేర్కొన్నారు. 1993ప్రాంతంలో ధర్మవరం, తాడిపత్రి, పెనుకొండ ప్రాంతాల్లో టీడీపీ జెండా పట్టుకునే వారే లేరని, ఆయనరాకతో పార్టీ అభిమానులు, కార్యకర్తల్లో ధైర్యం వచ్చిందన్నారు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చి జిల్లా టీడీపీని ముందుకు తీసుకెళ్లారన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది పరిటాల రవి అని, బతికిఉన్నంత వరకు ఆయనను మరువలేమన్నారు.

బడుగుల ఆశాజ్యోతి: కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే, రాయదుర్గం

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పరిటాల రవీంద్ర అని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆపద సమయంలో పార్టీకి ఆయన కొండంత అండగా నిలుస్తూ పార్టీశ్రేణుల్లో ధైర్యాన్ని నింపారన్నారు. వందలాది జంటలకు ఉచిత వివాహాలు జరిపించిన మహోన్నత వ్యక్తి పరిటాల రవీంద్రఅన్నారు.

వ్యక్తి కాదు.. ఒక శక్తి: దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే, అనంతపురం

పరిటాల రవి ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. టీడీపీ జెండా పట్టుకోవాలంటే భయపడే పరిస్థితుల నుంచి పార్టీకి జిల్లాను కంచుకోటగా మార్చారన్నారు. 20వ వర్ధంతి కాదు 100 వర్ధంతులు జరిగినా ఆయనపై ప్రజలకున్న అభిమానం తరగదన్నారు.

పరిటాల సునీత కంటతడి

పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పించే సమయంలో ఆయన సతీమణి ఎమ్మెల్యే పరిటాల సునీత భావోద్వేగానికి లోనయ్యారు. అక్కడే కాసేపు కుర్చొని కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనవరి నెల వచ్చిందంటే ఏదో తెలియని బాధ కలుగుతుందన్నారు. నేటికీ వేలాది మంది తరలి వచ్చి నివాళులర్పిస్తుంటే ప్రజల గుండెల్లో ఆయన ఎంత పదిలంగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఈనేల ఉన్నంతవరకు పరిటాల రవీంద్రను ఎవరు మరువరన్నారు. ఆరోజు ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ఆహ్వానించడమే కాకుండా, ఒక తండ్రిగా అండగా నిలిచారన్నారు. పరిటాల రవీంద్రకు భార్యగా ఉండటం నాకు దక్కిన గొప్పవరమన్నారు. ఆయన మరణం తరువాత ఎదుర్కొన్న కష్టాలు పగవాడికి కూడా రాకూడదన్నారు. ఆయనను ఫ్యాక్షనిస్టుగా ముద్రవేశారని, కానీ ఆయన ఫ్యాక్షన్‌నుంచి ఎన్నోగ్రామాలకు విముక్తి కలిగించి అభివృద్ధి చేశారన్నారు. తమ కుటుంబ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

పరిటాల ఆశయాలు గొప్పవి : పల్లె సింధూరారెడ్డి, ఎమ్మెల్యే, పుట్టపర్తి

ఒక వ్యక్తిపై ఇంత మంది ప్రేమాభిమానులు చూపిస్తున్నారంటే పరిటాల రవి ఎంత గొప్ప వ్యక్తో అర్థమవుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు పరిటాల రవీంద్ర అండగా నిలిచారని, అలాంటి వ్యక్తి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. చివరి వరకు ఆయన ఇచ్చిన మాటకోసమే పనిచేశారు.



పరిటాల రవి ఘాట్ వద్ద మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె తదితరుల నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సిద్ధార్థ, శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

పెనుకొండలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం : మంత్రి సవిత

బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్యదైవంగా పరిటాల రవి నిలిచారని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ రోజు ఈ ప్రాంతంలో ఇంత స్వేచ్ఛగా కనిపిస్తోందన్నా, ఆడబిడ్డలు ధైర్యంగా బయట తిరుగుతున్నారన్నా అది కచ్చితంగా పరిటాల రవి చేసిన పోరాట ఫలితమే అన్నారు. శ్రీకాకుళం ప్రాంతంలో కూడా పెనుకొండపేరు చెబితే అది పరిటాల రవి నియోజకవర్గం కదా అంటున్నారంటే ఆయన ఈ ప్రాంతంపై ఎలాంటి ముద్ర వేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే పెనుకొండలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు. పరిటాల సునీత ఒక వీర వనిత అని పేర్కొన్నారు.



తరలివచ్చిన పరిటాల అభిమానులు, టీడీపీ కార్యకర్తలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ, ఆలం నరసానాయుడు తదితరులు

ప్రజాదరణ తరగని నేత: అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

మరణించి 20ఏళ్ల అయినా ఇప్పటికి ప్రజాదరణ తగ్గనినేతగా పరిటాల రవీంద్ర ఉన్నారని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమలినేని సురేంద్రబాబు వెల్లడించారు. ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడ్డారన్నారు. అందుకే ఆయన నేటికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాపోయారని కొనియాడారు.

పోరాటాలకు స్ఫూర్తి పరిటాల రవీంద్ర: ఎంఎస్‌రాజు, ఎమ్మెల్యే, మడకశిర

జిల్లాలో రాజకీయ, ప్రజాపోరాటాలకు స్ఫూర్తి పరిటాల రవీంద్ర అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఆయన అనంతపురం జిల్లాలో కాకుండా రాష్ట్రంలోనే పేరున్న నాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

జిల్లాపై చెరగని ముద్ర : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

జిల్లా రాజకీయాలపై పరిటాల రవీంద్రది చెరగని ముద్ర అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పరిటాల రవీంద్రతో 1993 నుంచి 2005 వరకు తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను పల్లె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో కూడా టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.

ప్రాణాలు తీస్తారని తెలిసినా వెనక్కి తగ్గలేదు: హనుమంతరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యే

2004లో అధికారం కోల్పోయాక శత్రువులు తనను హతమార్చడానికి పొంచి ఉన్నారని తెలిసిన వెనక్కి తగ్గని ధైర్యశాలి పరిటాల రవీంద్ర అని మాజీ ఎమ్మెల్యే హనుమంత రాయచౌదరి పేర్కొన్నారు. కొన్ని రోజులు బయటకు వెళ్లి ప్రాణాలు కాపాడుకోవాలని సూచిస్తే తాను వెళితే తనవాళ్లు అన్యాయం అవుతారని ధైర్యంగా నిలబడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

బడుగులకు రాజకీయ అవకాశాలు: తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

ఉమ్మడి జిల్లాల ఓఓ బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన వ్యక్తి పరిటాల రవి అని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కొనియాడారు. ఆయన ఆశయాలు ఎంతో గొప్పవని అందుకే ఆయన ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.



నివాళులర్పిస్తున్న చమన్ సతీమణి, తనయుడు



ఎంపీ బీకే , ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్..



అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ...



అనంతపురం జిల్లా టీడీపీ నేతలు...

సాయం చేసి.. చోరీ

ఇంటి యజమానిని ఆస్పత్రికి చేర్చి..

10తులాల బంగారు ఆభరణాల అపహరణ

గంటల్లో పట్టేసిన వన్‌టౌన్ పోలీసులు.. సొమ్ము రికవరీ

అనంతపురం క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో సాయం చేసిన వ్యక్తే ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన సంఘటన నగరంలోని రాణీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. నగరంలోని రాణినగర్‌లో మహమ్మద్ నబీ రసూల్(58)కుటుంబం నివాసముంటోంది. రసూల్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. గురువారం కుమార్తె కొడుకు(మనవడు)డికి సంబంధించి తల వెంట్రుకలు తీయించే కార్యక్రమం నిర్వహించారు. దీంతో కొడుకులు, కుమార్తె వచ్చారు. రాత్రి ఫంక్షన్ అయిపోయాక అర్ధరాత్రి 12గంటల సమయంలో నబీ రసూల్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంలో పక్క ఇంట్లో ఉంటున్న గౌస్‌మోద్దీన్ ఆటోలో తీసుకెళ్లడానికి సాయం చేస్తూ వారితో పాటే ఆటోలో వెళ్లాడు. కుటుంబసభ్యులందరూ అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో ఓ వృద్ధురాలిని మాత్రమే ఉంచి వచ్చారు. బయట గేటుకు తాళం వేసి వెళ్లారు. ఆసుపత్రిలో రసూల్ చికిత్స పొందుతున్న సమయంలో మహిళలు.. ఇంట్లోనే బంగారు ఆభరణాలు ఉంచి వచ్చామని, కనీసం బీరువాలో ఉంచలేదని మాట్లాడుకోవడం గౌస్ మోద్దీన్ విన్నాడు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నబీ రసూల్ మృతి చెందాడు. కుటుంబసభ్యులు విషాదంలో ఉండిపోయారు. అరగంట తరువాత గౌస్‌మోద్దీన్ నేరుగా రసూల్ ఇంటికి వచ్చాడు. గేటు దూకి లోపలికెళ్లాడు. ఇంట్లో ఉన్న వృద్ధురాలు ఏం వచ్చావని ప్రశ్నిస్తే నబీరసూల్ చనిపోయాడని ఆ విషయం మీకు చెబుదామని వచ్చానన్నాడు. ఇంట్లో తచ్చాడుతుంటే వృద్ధురాలు ప్రశ్నించగా ఆధార్‌కార్డు తీసుకురమ్మని చెప్పారని చెప్పాడు. ఈక్రమంలోనే వృద్ధురాలికి మస్కా కొట్టి మంచంపైన పరుపుకింద ఉన్న 10తులాల బంగారు ఆభరణాలు తీసుకుని ఉడాయించాడు. ఉదయం ఇంటికొచ్చిన కుటుంబసభ్యులు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. వృద్ధురాలి అనుమానం మేరకు నబీరసూల్ కుమారుడు దూదేకుల షానూర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ అప్రమత్తమయ్యారు. సిబ్బందితో కలిసి గంటల వ్యవధిలోనే గౌస్‌మోద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా గౌస్‌మోద్దీన్ తాను చేసిన నేరం ఒప్పుకున్నాడు. అతడి నుంచి 10తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.



చోరీ జరిగిన ఇల్లు

31న ఉమ్మడి జిల్లాకు ఎక్సైజ్ మంత్రి 'కొల్లు' రాక

అనంతపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటనకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ కమిషనర్ నిశాంత్‌శర్మ, డైరెక్టర్ రాహుల్‌దేవ్ వర్మ ఈ నెల 31న రానున్నారు. ప్రైవేట్ మద్యం దుకాణాల నిర్వహణ ఎలా సాగుతోంది..? అక్రమ మద్యం అరికట్టడంలో అధికారులు ఏ విధంగా పనిచేస్తున్నారు..? బెల్టుషాపులను నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారుల పనితీరు తదితర అంశాలపై వీరు సమీక్షించ నున్నారు. పర్యటనలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలోని పాలసముద్రం సమీపంలో ఐఎంఎల్ డిపో భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేస్తారు. తర్వాత అనంతపురం నగర శివారులోని సోములదొడ్డి వద్ద నిర్మించిన ఐఎంఎల్ డిపో భవనాన్ని ప్రారంభిస్తారు. 2014లో ఇక్కడ ఉన్న ఐఎంఎల్ డిపో అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. దీంతో అక్కడే కొత్త భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్నే మంత్రి ప్రారంభించనున్నారు. కాగా... నవోదయం 2.0 రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా నుంచే ప్రారంభించనున్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఎక్సైజ్ శాఖ పనితీరుపై మంత్రి సమీక్ష చేయనున్న నేపథ్యంలో ఆ శాఖాధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం. దీనికి తోడు బెల్టు తీసేదెవరు..? శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనం నేపథ్యంలో... అనధికారిక పర్మిట్ రూములు, బెల్టుషాపులు నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు సమాచారం.

వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. కామ్రేడ్ జెడ్ వీరారెడ్డి 20వ వర్ధంతిని శుక్రవారం సాయంత్రం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, గుత్తి సమితి ప్రెసిడెంట్‌గా, కమ్యూనిస్టు నేతగా వివిధ రంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి వీరారెడ్డి అని కొనియాడారు. అనేక పోరాటాల్లో రాటుదేలిన వీరారెడ్డి చనిపోయి 20 సంవత్సరాలైనప్పటికీ ఆయన స్ఫూర్తిని నెమరు వేసుకుంటూ నేటి సీపీఎం నాయకత్వం జిల్లాలో పెద్దఎత్తున రైతు, కార్మిక పోరాటాలతో ఆందోళనలను కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌వీ నాయుడు, ముత్తుజా, వెంకటనారాయణ, ఇర్ఫాన్, ఓబులేసు, రాజు, ప్రకాష్‌రెడ్డి, ఎర్రిస్వామి, గఫూర్, బాలకృష్ణ, ఆదినారాయణ, పోతులయ్య, శంషాద్, లాలెమ్మ, మాబ్బి తదితరులు పాల్గొన్నారు.



వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శివకార్తికేయరెడ్డి, కమిటీ సభ్యులు

పామిడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో శుక్రవారం ప్రభుత్వ వైద్యుడు కమలాధర్ అరుదైన ఆపరేషన్ చేశారు. పట్టణంలోని తిరుమలేసు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. పరీక్షించిన వైద్యులు దెర్మాయిడ్ సిస్ట్ ఆపరేషన్ చేయాలని సూచించారు. వైద్యుడు కమలాధర్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తికేయరెడ్డి, కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన వైద్యుల ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఎన్నో శస్త్ర చికిత్సలను ఇక్కడే విజయవంతంగా చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, హెడ్ నర్సు శివకుమారి, ఓటీ అసిస్టెంట్ అంజనప్ప, కమిటీ సభ్యురాలు పూజారి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.17,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 20 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



రిపబ్లిక్ డే ఏర్పాట్ల పరిశీలన



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జేసీ

అనంతపురం టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్‌డే ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేపడుతూ వస్తోంది. జిల్లా ఎస్పీ జగదీష్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడే అధికారులతో సమావేశ మై ఏర్పాట్లు విషయంలో ఎక్కడెక్కడా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆదేశాలు జారీ చేశారు. వేడుకలు వీక్షించడానికి వచ్చే వారికి అవసరమైన కుర్చీలు, గ్యాలరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రిహార్సల్స్ చేయించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, డీపీఎం ఆనంద్, సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.10



అనంతపురంరూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1,350 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.


ఏపీ హ్యాండ్‌బాల్ జట్టుకు ఇంటర్ విద్యార్థి



రాజును అభినందిస్తున్న శామ్యూల్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్‌జీఎఫ్(స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) హ్యాండ్‌బాల్ పోటీలకు కంబదూరుకు చెందిన విద్యార్థి రాజు ఎంపికయ్యాడు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 27వతేదీ నుంచి నిర్వహించే 38వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ రాష్ట్ర జట్టు తరఫున రాజు ప్రాతినిథ్యం వహించనున్నాడు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన రాజును విద్యాశాఖ ఆర్‌డీ శామ్యూల్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శివశంకర్, పీడీలు కేశవమూర్తి, శ్రీనివాసులు, నాగరాజులు అభినందనలు తెలిపారు.

జాతీయ ఉత్తమ రైతుగా రమేష్‌నాయుడు



ఆత్మకూరు జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. సిద్దరాంపురం గ్రామానికి చెందిన రాజనేని రమేష్‌నాయుడుకు జాతీయ ఉత్తమ రైతు అవార్డు లభించింది. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతులు మీదుగా అందుకోనున్నారు. ఉద్యాన పంటల్లో మంచి దిగుబడులు సాధించడంతో పాటు పండ్లతోటలను వినూత్న రీతిలో సాగుచేయడంలో రైతులకు ఆదర్శంగా నిలిచారు. దీంతో ఉత్తమరైతు అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. అవార్డు సాధించిన రమేష్‌నాయుడును పలువురు రైతులు అభినందించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

విలియమ్ సోమర్‌సెట్ మామ్ (జయంతి)



ప్రముఖ ఆంగ్ల రచయిత విలియమ్ సోమెర్‌సెట్ మామ్ 1874 జనవరి 25న ఫ్రాన్స్ దేశం ప్యారిస్‌లో జన్మించారు. ఆంగ్ల నాటక, నవలా రచయిత, చిన్న కథల రచయిత. 1930 దశకంలో అత్యధిక పారితోషికం పొందిన రచయితలలో ఒకరిగా నిలిచారు. మొదటి ప్రపంచయుద్ధ సమయంలో రెడ్‌క్రాస్‌తో కలసి పనిచేశారు. బ్రిటీష్ సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్‌లో పనిచేశారు. యుద్ధం అనంతరం ఇండి టయాతోపాటు దక్షిణ ఆసియా, పసిఫిక్‌లో పర్యటించిన అనుభవాలతో సెమీ-ఆటోబయోగ్రఫీ నవల రాశారు. 1954లో 'కంపానియన్ ఆఫ్ హానర్' గౌరవం పొందారు. 1965 డిసెంబరు 16న కన్నుమూశారు.

వర్జీనియా వూల్ఫ్ (జయంతి)



ఇరవయ్యో శతాబ్దపు ఆధునిక కవయిత్రులలో ఒకరైన ప్రముఖ ఆంగ్ల రచయిత్రి అడెలైన్ వర్జీనియా వూల్ఫ్ 1882 జనవరి 25న లండన్‌లోని కెన్సింగ్‌టన్ ప్రాంతంలో జన్మించారు. 500కు పైగా ఆటో బయోగ్రఫీలు, వ్యాసాలు, రివ్యూలు రాశారు. ప్రత్యేకించి మానవ సంబంధాలు, ఆధునిక పరిస్థితులను తలపించేలా రచనలు ఉండేవి. కవితలు, లెక్కకు మిక్కిలి నవలలు రాసి ప్రచురించారు. 1941 మార్చి 28న కన్నుమూశారు.

కేఎస్ నారాయణ అయ్యంగార్ (జయంతి)



కేఎస్ నారాయణ అయ్యంగార్ 1903 జనవరి 25న తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి ప్రాంతంలో జన్మించారు. దక్షిణాదిన కర్ణాటక సంగీత వాయిద్యమైన చిత్రవీణ (గోటువాద్యం) కళాకారుడిగా పేరొందారు. గోటువాద్యాన్ని అభివృద్ధి చేసి అందరి మన్ననలు పొందారు. 20వ యేటనుంచి కచేరీలు ఇచ్చారు. తిరువనంతపురం, మైసూరు రాజసంస్థానాలలోనూ ప్రదర్శనలు ఇచ్చారు. నాదబ్రహ్మ విద్యావారిధి, దిగ్విజయ నాదవాణి, గోటువాద్య కళానిధి తదితర బిరుదులు పొందారు. 1959 జనవరి 11న కన్నుమూశారు.

ఎంఎన్ రాయ్ (వర్ధంతి)



ఇరవయ్యో శతాబ్దపు తత్త్వవేత్తలలో ప్రముఖులైన మానవేంద్ర నాథ్ రాయ్ 1887 మార్చి 22న పశ్చిమబెంగాల్‌లోని చాంగ్రిపోట ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. హేతువాది, మానవతావాది, రాజకీయ సిద్ధాంత కర్త, రష్యా తర్వాత ప్రపంచంలో మొదటగా మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన వ్యక్తి రాయ్. రష్యాలో లెనిన్ మరణానంతరం స్టాలిన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయ్ క్రియాశీలక కమ్యూనిస్టు రాజకీయాలనుంచి తప్పుకుని భారతదేశానికి వచ్చి రాడికల్ డెమోక్రటిక్ పార్టీని స్థాపించారు. 1944లో మన దేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండాలనే భావనను ప్రతిపాదించిన తొలి భారతీయుడు. 17 భాషలలో ప్రావీణ్యం గలవారు. 1954 జనవరి 25న కన్నుమూశారు. కాగా ఎంఎన్ రాయ్ సాధనలపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 4 వాల్యూమ్స్‌ను విడుదల చేయడం విశేషం.

కవితా కృష్ణమూర్తి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కవితా కృష్ణమూర్తి సుబ్రమణియమ్ 1958 జనవరి 25న ఢిల్లీలో తమిళ కుటుంబంలో జన్మించారు. అసలు పేరు శారద. నేపథ్య గాయకురాలిగా 16 భాషలలో 25వేలకు పైగా పాటలు పాడారు. పాప్, భక్తి పాటలు సైతం ఆలపించారు. సంగీత ప్రధానమైన రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆమె భర్త సుబ్రమణియమ్ వయోలిన్ కళాకారుడు. ఆమె బెంగళూరులో అకాడమీ ఆఫ్ పర్‌ఫార్మింగ్స్ ఆర్ట్స్‌ను ఏర్పాటు చేశారు. లతా మంగేష్కర్ అవార్డు, నాలుగు ఫిల్మ్‌ఫేర్, జీ సినీ అవార్డుతోపాటు పలు అవార్డులు పొందారు. జైన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు.

చతేశ్వర పూజార (పుట్టినరోజు)



చతేశ్వర అరవింద్ పూజార 1988 జనవరి 25న గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో జన్మించారు. దేశ అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం టెస్ట్ మ్యాచ్‌లు ఆడారు. సౌరాష్ట్ర నుంచి ప్రాతినిథ్యం వహించారు. ప్రస్తుతం ససెక్స్ కంట్రీక్లబ్‌కు కేప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. 18 టెస్ట్ ఇన్నింగ్స్‌లో 11 మ్యాచ్‌లలో వెయ్యి పరుగులు సాధించి ఫాస్టెస్ట్ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా నిలిచారు. 2021లో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టెస్ట్ బ్యాట్స్‌మన్‌గా వరల్డ్ నెంబరు 14వ స్థానంలో నిలిచారు. 2017లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పన్నెండోసారి డబుల్ సెంచరీ సాధించి విజయ్ మర్చంట్ రికార్డును అధిగమించారు. ఐదు వన్డేలలోనూ, ఐపీఎల్ 2021లో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులోనూ ఆడారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో 19 సెంచరీలు పూర్తి చేసిన ఘనత ఉంది.

యాంత్రీకరణతో ఉత్పాదనరంగం ప్రగతి

కేంద్రమంత్రి కుమారస్వామి

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణతో ఉత్పాదనా రంగం ప్రగతి సాధించనుందని కర్ణాటక జాతీయస్థాయిలో 50శాతం ఉత్పాదన గడించిందని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అభిప్రాయపడ్డారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటైన ఇంటెక్స్ సదస్సు ప్రారంభంలో కుమారస్వామి మాట్లాడారు. యంత్రోపకరణాల రంగంలో రాష్ట్రంలో ఐదు దశాబ్దాలక్రిందటే శక్తివంతమైన పునాది వేసిందన్నారు. హిందూస్తాన్ మిషన్ అండ్ టూల్స్ (హెచ్ఎంటి) గణనీయమైన ప్రగతికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆధునిక ఉత్పాదనా రంగం ప్రోత్సాహకానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారన్నారు. సాంకేతిక ఉన్నతీకరణ, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి భారత్‌లక్ష్యంగా ఉందన్నారు. రెండోరోజు ప్రదర్శనలకు పెద్దఎత్తున ప్రజలు భాగస్వామ్యులయ్యారు.



ఇంటెక్స్ సదస్సులో కేంద్రమంత్రి కుమారస్వామి తదితరులు

ఆకట్టుకుంటున్న సెరాటిజెట్ ఉత్పత్తులు



సెరాటిజెట్ స్టాల్ ప్రారంభంలో కంపెనీ ముఖ్యులు

బెంగళూరు: అంతర్జాతీయ స్థాయిలో సాగుతున్న ఇంటెక్స్ ప్రదర్శనలో సెరాటిజెట్ ఉత్పత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. గ్లోబల్ స్థాయిలో ఉన్నతమైన టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగంలో వందేళ్ళ అనుభవం కలిగినది. మెటీరియల్ కటింగ్, వేర్ ప్రొటెక్షన్ రంగంలో తమ ఉత్పత్తులు విశ్వవ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు సెరాటిజెట్ ఏషియా పసిఫిక్ ఛైర్మన్ ఆండ్రియాన్ ఫ్రిట్జ్, ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌లు తెలిపారు. మెటల్ కటింగ్ పరిశ్రమకు దేశవ్యాప్తంగా తమ ఉత్పత్తులు సమకూరుస్తున్నట్లు వివరించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తమ బ్రాండింగ్‌లోను కొత్త విధానాలు తీసుకువస్తున్నామన్నారు. సంస్థ సుస్థిరతకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని మా లక్ష్యంగా భావించడం లేదని మా ధ్యేయంగా పరిష్కారాల కోసం నిరంతరంగా శ్రమిస్తామన్నారు. ఇంధన వ్యయాన్ని తగ్గించే దిశగా భవిష్యత్ తరాలకు అనుగుణమైన ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

భావితరాలకు అనుకూలంగా తైవాన్ ఉత్పత్తులు

బెంగళూరు భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండేలా తైవాన్ ఉత్పత్తులు సాధ్యం చేస్తున్నామని చెన్నైలోని తైపై ఆర్థిక సాంస్కృతిక కేంద్ర డైరెక్టర్ రిచర్డ్‌చెన్ అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఆరంభమైన ఐఎంటిఇఎక్స్ ప్రదర్శనలలో ఏర్పాటు చేసిన తైవాన్ శిబిరాన్ని సందర్శించారు. తైవాన్ ఎక్సలెన్స్ పేరిట ఏర్పాటైన శిబిరంలో ఆటోగ్రిప్, సీహెచ్ ఎంఈఆర్, ఇన్‌గ్రిట్, క్యాన్‌ఫ్యాన్, మెకాం పల్మరీ, క్వాసరీ సహా 13 ప్రముఖ తైవాన్ బ్రాండ్‌లు నెక్స్‌జెన్ ఉత్పాదనా పరికరాలను ప్రదర్శించింది. తైవాన్ దేశానికి చెందిన ఉత్పత్తులు భారత్‌లో 4శాతం దిగుమతి చేసుకుంటోందన్నారు. తైవాన్ మెషన్ టూల్స్ ఎగుమతుల ఏటా పెరుగుతున్నాయని 20.8శాతంకు పెరిగి 145.87 దశలక్ష డాలర్‌లకు చేరిందన్నారు. భారత్ ఉత్పాదనా రంగంలో యంత్రోపకరణాలు, వాహనాలు, రక్షణారంగంలో విశ్వవ్యాప్తంగా ఆదరణ కలిగి ఉన్నాయన్నారు. కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య అధ్యక్షులు ఎంజి బాలకృష్ణ మాట్లాడుతూ తైవాన్ దేశ ఉత్పత్తులు నాణ్యతగా ఉన్నందునే దేశంలో ఆదరణ లభిస్తోందన్నారు. ఐఎంటిఇఎక్స్ ప్రదర్శనలతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో ఆధునిక అంశాలపై చర్చలు చర్చాగోష్టులు దిశానిర్దేశం చేస్తున్నాయన్నారు. తైవాన్ దేశానికి చెందిన పారిశ్రామిక కంపెనీల ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి





హాజరైన విద్యార్థులు, ప్రసంగిస్తున్న రిటైర్డు బీఈఓ నాగేంద్రప్రసాద్

ముళబాగిలు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి ఎస్ఎస్ఎల్‌సి అనేది ఎంతోకీలకమైన దశ అని భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రిటైర్డు బీఈఓ ఐఎన్ నాగేంద్ర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అమర జ్యోతి విద్యాసంస్థ ప్రాంగణంలో ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకోసం ఏర్పాటైన మార్గదర్శన చర్చాగోష్టిలో పాల్గొని మాట్లాడుతూ మార్చి 21నుంచి పరీక్షలు జరగనున్నాయన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రతి సబ్జెక్టును ఒకసారి చదివి మరోసారి రివిజన్ చేసుకోవాలన్నారు. ప్రతి పాఠాన్ని అభ్యాసం చేయడం ద్వారా అన్ని ప్రశ్నలకు జవాబు ఇచ్చేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కువమార్కులు సాధించేందుకు పాఠ్యపుస్తకాన్ని సమగ్రంగా చదవాల్సి ఉందన్నారు. ఈసారి ఎటువంటి గ్రేస్‌మార్కులకు అవకాశం లేదని గుర్తుంచుకోవాలన్నారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సీసీ కెమెరాలతోపాటు వెబ్‌కాస్టింగ్ అమలు చేస్తారన్నారు. కావున ప్రతి విద్యార్థి చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా విద్యాసంస్థ అధ్యక్షుడు కాడేనహళ్ళి నాగరాజ్, కార్యదర్శి యలువహళ్ళి ఆర్ అశోక్‌కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంగారెడ్డి, ఉపాధ్యాయులు నారాయణస్వామి, ముని వెంకటప్ప, కృష్ణాచారి, హరీశ్‌కుమార్, ఎం వెంకటాచలపతి, విజయలక్ష్మి, హిరణ్యగౌడ, శివకుమార్, అశ్వత్థప్ప, అశ్వథ్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

మల్లసంద్ర డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం



అధ్యక్ష, ఉపాధ్యక్షులతో నూతన పదాధికారులు

బాగేపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తాలూకాల్లోని మల్లసంద్ర పాల డెయిరీ పాలకవర్గం కాంగ్రెస్ మద్దతుదారులకు దక్కింది. అధ్యక్షుడిగా ఎంఆర్ అశ్వత్థరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎంసీ వెంకటేశ్ ఎన్నికయ్యారు. మల్లసంద్ర డెయిరీ ఆవరణలో జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికల్లో కేవలం ఒక్కొక్కటే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇప్పటికే జరిగిన ఎన్నికల ప్రక్రియలో డైరెక్టర్లుగా ఎంఎన్ నాగభూషణరెడ్డి, ఉమదేవి, అలివేలమ్మ, బిక్కూరు కృష్ణప్ప, కోనప్ప, ఆదినారాయణప్ప ఎంఎన్, కోలాట ఆదినారాయణప్ప, ఎంఎన్ మంజునాథ, అంగడి నారాయణప్ప, శ్రీనివాస్, రామాంజి ఏకగ్రీవ మయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు మల్లికార్జున రెడ్డి, నారా యణరెడ్డి, ఆదినారాయణప్ప, లంబు శ్రీనివాస్, ఎంఎన్ కృష్ణారెడ్డి, ఎంఎన్ గంగిరెడ్డి, పురుషోత్తమ రెడ్డి, వెంకటేశ్, ఎంవి సూర్య నారాయణ రెడ్డి, కృష్ణప్ప, ఊగలనాగేపల్లి కృష్ణ, ఎంసీ అశ్వత్థప్ప పాల్గొని నూతన పదాధికారులను అభినందించారు.

గూరమడగు సంఘానికి..

శిడ్లఘట్ట : తాలూకా లోని గూరమడగు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో 10మంది కాంగ్రెస్ మద్దతు దారులు, ఇద్దరు జేడీఎస్ మద్దతుదారులు గెలుపు సాధించారు. ఐదేళ్లపాటు డైరెక్టర్లుగా కొనసాగనున్నారు. సంఘానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపు సాధించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నారాయణస్వామి, ఓబణ్ణ, ఆర్ వెంకటేశ్, అనిత, పిళ్ళక్క, మునివీరప్ప, గోపాలకృష్ణ, కృష్ణప్ప, నాగరాజప్ప, బి నారా యణస్వామి, రాజేశ్, చంద్రప్ప గెలుపొందారు. కాంగ్రెస్ మద్దతుదారులను కొత్తనూరు గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు జీకే మంజునాథ్ అభినందించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షు రాలు పార్వతమ్మ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు మంజు నాథ్, సభ్యులు వెంకటరోణప్ప, ప్రముఖులు అంగడి మంజునాథ్, నారా యణస్వామి, ఫ్లోర్‌మిల్ మంజునాథ్, డీఎస్ఎస్ జిల్లా సంఘటనా సంచాలకులు నారాయణస్వామి పాల్గొన్నారు.



సంఘం నూతన డైరెక్టర్లకు సన్మానం

సేంద్రియ మేళా.. ఆకట్టుకున్న ఏపీ స్టాల్

బెంగళూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాణిజ్యమేళా, సిరిధాన్యాలు, సేంద్రియ మేళాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సహజ వ్యవసాయంపై స్టాల్‌లో ప్రగతిని వివరిస్తున్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 10లక్షలమంది రైతుల ద్వారా 12లక్షల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించినట్టు రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ హెడ్ పి ప్రభాకర్ తెలిపారు. 2.31లక్షల స్వయంసహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులు చేసినట్టు తెలిపారు. 3009 రైతు భరోసా కేంద్రాల ద్వారా 4,116 గ్రామపంచాయతీలలో 10 వ్యవసాయ పంట దిగు బడులను సాధ్యం చేసినట్టు తెలిపారు. మార్క్‌ఫెడ్, తిరుమల తిరుపతి దేవస్థానంతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. సేంద్రియమేళా ప్రదర్శనలో రోజూ వందలాదిమంది స్టాల్‌ను సందర్శిస్తున్నారని, కర్ణాటకతోపాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఉత్సాహంగా తెలుసుకుంటున్నారన్నారు. ఏపీ నుంచి 15 మంది బృందం ఏపీ పెవిలియన్‌లో రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఏపీ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ అధికారి సందర్శించారన్నారు. కర్ణాటక వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామితోపాటు స్టాల్‌ను సందర్శించి ప్రకృతి వ్యవ సాయంపై అడిగి తెలుసుకున్నారన్నారు.

మహదేవపుర ఉత్సవకు సన్నాహాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాటంనల్లూరు మంజునాథస్వామి కల్యాణమండపంలో ఏర్పాటయ్యే మహదేవపుర ఉత్సవకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. మాజీ మంత్రి అరవింద లింబా వళి, ఎమ్మెల్యే మంజుళా లింబావళిలు శుక్రవారం ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లింబావళి మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా భారతమాత పూజ, మహదేవపుర ఉత్సవం ఉంటాయన్నారు. స్థానిక ప్రతిభావంతులకు అవకాశం కల్పించేలా వివిధ పాఠశాల, కళాశాలలనుంచి భరతనాట్య, సంగీత, నృత్య, డోలు కళాబృందాలు, రసమంజరి, సిద్దేశ్ కామెడీ, డ్రమ్స్ సునీల్ ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. బంగ్లాదేశ్ యుద్ధవీరుడు కల్నల్ తివారి, కల్నల్ గోపినాథ్, కల్నల్ ఆర్‌పి సింగ్‌లు ప్రారంభిస్తారన్నారు. నియోజక వర్గంలో వివిధరంగాల సాధకులకు మహదేవపుర రత్న పురస్కారంతో సత్కరించనున్నట్టు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో మానసిక రుగ్మతలపై అధ్యయనం

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో మానసిక రుగ్మతలపై బాధపడుతున్న వారికోసం నిమ్హాన్స్ వైద్యనిపుణులతో కలసి లైఫ్లీ లాఫ్ ఫౌండేషన్ అధ్యయనం సాగించారు. సైక్రియాట్రిక్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మురళి దొరస్వామితోపాటు బృందం దావణగెరె జిల్లా జగళూరు తాలూకా వ్యాప్తంగా పరిశోధనలు జరిపింది. తీవ్రమైన మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నవారు సైతం స్వయం ఉపాధి కల్పించేలా ప్రోత్సహించవచ్చునని నిర్ధారించింది. తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి తగిన సహకారం అందించాలనేది లక్ష్యంగా ఉంది. లైఫ్లీ లాఫ్ ఫౌండేషన్ సీఈఓ అనిషా పడుకొనె అభిప్రాయం ప్రకారం 2016 నుంచి వివిధ ప్రాంతాలలో మానసిక ఆరోగ్య కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. రోగులకు తగిన సమయంలో చికిత్సలు అందిస్తే త్వరితగతిన కోలుకుంటారని అభిప్రాయపడ్డారు. అందుకే ఆర్థికభారం కాకుండా వారు చేయగలిగిన పనుల ద్వారా ఆర్థికంగా పరిపుష్టి చేయాలని భావిస్తున్నామన్నారు. జగళూరు తాలూకా వ్యాప్తంగా పలువురు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నవారికి నిమ్హాన్స్‌లో చికిత్సలు, కౌన్సెలింగ్ జరిపించామన్నారు. నిమ్హాన్స్‌లోని సైక్రియాట్రిక్ రిహాబిలిటేషన్ ప్రొఫెసర్ ధనపాల్ శివకుమార్, డాక్టర్ శనివారం రెడ్డి, చన్నవీరాచారి నవీన్‌కుమార్, జగదీశ్ తీర్థహళ్ళి, ఫౌండేషన్ ముఖ్యులు డాక్టర్ శ్యామ్‌భట్‌లు అధ్యయనంపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

మెర్క్ బయోటెక్ సంస్థ విస్తరణ

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పీణ్యా పారిశ్రామికవాడలోని మెర్క్ బయోటెక్ సంస్థ తన పరిశ్రమను విస్తరింపచేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మెర్క్ లైఫ్‌సైన్స్ గ్లోబల్‌ప్లాంట్ ఆపరేషన్ హెడ్ టోనిక్యు, సైట్ డైరెక్టర్ ప్రసన్న తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టోనిక్యు మాట్లాడుతూ బయోటెక్ రంగంలో పరిశోధనలు విస్తారం చేయదలిచామన్నారు. పీణ్యాలోని ఫెసిలిటీ సెంటర్ విస్తారం ద్వారా దేశవ్యాప్తంగా మరో మైలురాయిని అధిగమించదలిచామన్నారు. అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ చేపట్టదలిచామని, ప్రపంచస్థాయిలో అవసరమైన సౌలభ్యాలు సమకూర్చదలిచామన్నారు. మెర్క్ సంస్థ ముఖ్యులు ఆదిత్యాశర్మ, ధనంజయ్‌సింగ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



పీణ్యాలోని ఫెసిలిటీ సెంటర్ విస్తరణలో సంస్థ ప్రముఖులు

గాయపడ్డ గర్భిణికి చికిత్స విజయవంతం

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడ్డ గర్భిణీకి చికిత్సల ద్వారా సహజకాన్పు విజయవంతం చేసినట్టు గైనకాలజిస్ట్ గాయత్రి తెలిపారు. రెండువారాలలో కాన్పు కావాల్సిన మహిళ ప్రమాదానికి గురయ్యారన్నారు. ఆమె రెయిన్‌బో ఆసుపత్రిలో చేరగా వైద్య నిపుణుల బృందం పర్యవేక్షణలో ప్రమాదానికి శస్త్రచికిత్సలు జరిపించారు. అనంతరం సహజకాన్పు చేసినట్టు తెలిపారు. సాధారణంగా ప్రమాదంలో ఫ్రాక్చర్లకు మూడు వారాలకుపైగా విశ్రాంతి అవసరమని కానీ కాన్పు సమయానికే ఆపరేషన్ అయినా విజయవంతం సాధ్యం చేశామన్నారు.

జయంతులను ఘనంగా ఆచరిద్దాం

సిరుగుప్ప, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మడివాళ మాచిదేవ జయంతి, కవితా మహర్షి జయంతి, కన్నడ సాహిత్య సమ్మేళనంలను ఘనంగా నిర్వహిద్దామని డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ తాలుకా పంచాయతీ భవనంలో జయంతి వేడుకలు నిర్వహించడంపై పూర్వపరాల సమావేశం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జయంతిలను ఘనంగా ఆచరిద్దామని పిలుపునిచ్చారు. ఊరేగింపు, వేదిక కార్యక్రమాలను అధికారులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదిలింగప్ప, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సమాజ సేవకుడు అబ్దుల్ నబీ, వివిధ సమాజ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రక్కు క్యాబిన్‌లో చెలరేగిన మంటలు

రాయచూరు జనవరి 24(ఆంధ్రజ్యోతి): లారీ బ్యాటరీ హీట్ కావడంతో బ్యాటరీకి మంటలు అంటుకుని లారీ క్యాబిన్ దగ్ధమైన సంఘటన శుక్రవారం జిల్లాలో మాన్వి తాలూకాలోని కపగల్ సమీపంలో చోటు చేసుకుంది. లారీకి మంటలు అంటుకోవడంతో లారీ డ్రైవర్, క్లీనర్ లారీని వదిలి బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో రాయచూరు, మాన్వి రహదారి పై కింత సేపు రాకపోకలను ఇబ్బంది కలిగింది. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న మాన్వి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. మాన్వి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.



క్యాబిన్‌లో చెలరేగుతున్న మంటలు

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలై.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతిలో జరిగింది. ఈస్ట్ ఎస్ఐ మహేష్ తెలిపిన మేరకు శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన షేక్‌నూర్ మహ్మద్ ముబారక్ నగరంలోని కరకంబాడిలో ఉంటూ అమర ఆస్పత్రిలో మేల్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఇతడు.. లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. వీటిని తీర్చలేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే శుక్రవారం తిరుపతిలోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకుని విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ ఈయన బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బందితో కలిసి ఎస్ఐ మహేష్ అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ముబారక్ మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని తిరుపతి రూయాకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాక్ డోర్ ఉద్యోగం.. పెద్ద మోసం..!

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షలు వసూలు

హిందూపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగాన్ని కూడా మోసగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఐటీ, నాన్ ఐటీ కంపెనీల్లో అడ్డదారిలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి, రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, ఆశలు రేపుతున్నారు. డబ్బులు ఇస్తే.. అడ్డదారిలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మాయ మాటలు చెబుతున్నారు. వాటిని నమ్మి రూ.లక్షలు మోసగాళ్ల చేతిలో పెడుతున్నారు. తర్వాత కొన్నినెలలపాటు అదిగో.. ఇదిగో.. ఉద్యోగం అంటూ నమ్మిస్తున్నారు. కొన్ని నెలలకు మోసగాళ్ల ఫోన్ నంబర్లు పని చేయకుండా పోతున్నాయి. బాధితులు లబోదిబోమంటున్నారు.

ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగం ఇప్పిస్తామంటూ..

బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, డిగ్రీలు చదివి లక్షలాది మంది యువతీ యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఏటా లక్షల మంది విద్యార్థులు డిగ్రీలు, ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని, బయటకు వస్తున్నారు. వీరిలో కొందరికే ఉద్యోగాలు దొరుకుతున్నాయి. చాలామంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. వారు ఉద్యోగాన్వేషణలో పడుతున్నారు. నగరాలకు వెళ్లి చిన్నాచితకా ఉద్యోగులు చేసుకుంటున్నారు. చదువుకు తగిన ఉద్యోగం రాక, ఇతర పనులు చేయలేక సతమతమవుతున్నారు. ఎన్నో వ్యయప్రయాలకోర్చి పిల్లలను చదివిస్తే ఉద్యోగం రాక వారు పడుతున్న బాధలు చూసి, తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారు. ఇలా ఎన్ని సంవత్సరాలు ఎదురు చూసినా ఉద్యోగాలు రావనీ, వేరే మార్గం ఉందని నమ్మిస్తున్నారు. డబ్బులు ఇస్తే బ్యాక్‌డోర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. పరీక్షలు రాయనక్కరలేదనీ, ఇంటర్వ్యూ తాము చూసుకుంటామని చెబుతున్నారు. మేనేజర్లతో మాట్లాడుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామంటూన్నారు. ఉద్యోగాలు రాక నిరాశతో ఉన్న విద్యార్థులు ఈ విషయాలను తల్లిదండ్రులకు చెబుతున్నారు. కొంతమంది నేరుగా తల్లిదండ్రులతోనే మాట్లాడుతున్నారు. పిల్లలకు ఉద్యోగం వస్తే చాలని తల్లిదండ్రులు.. మోసగాళ్ల వలలో పడుతున్నారు. వారు అడిగినంత సొమ్ము చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. అప్పులు చేసి.. మరీ డబ్బు చెల్లిస్తున్నారు. రెండు నెలల్లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బు తీసుకుంటున్నారు. ఐటీ ఉద్యోగానికైతే రూ.2.5 లక్షలు, నాన్ ఐటీకైతే రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. డబ్బు ముట్టాక కొన్నిరోజులు మాటలు చెబుతున్నారు. ఉద్యోగం ఇప్పించే పనిలోనే ఉన్నామంటారు. ప్రస్తుతం కంపెనీలోనే ఉన్నామనీ, ఉద్యోగం గ్యారంటీ అంటారు. తరువాత మెల్లగా ఫోన్ తీయడం మానేస్తారు. అనంతరం ఫోన్ నంబర్ మార్చేస్తారు. మోసపోయామని గ్రహించిన తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇంకొంతమంది డబ్బు ఇచ్చి ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1619.55	1,588.75
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.801	451
నీటి నిల్వ (టీఎంసీలు)	60.08	10.02

నేడు జిల్లాకు మంత్రి రహీమ్



బళ్లారి సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్,హజ్ శాఖ మంత్రి రహీమ్ ఖాన్ 25,26 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఆయన బళ్లారికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటలకు పార్టీ కార్యాలయాన్ని సందర్శిస్తారు. అనంతరం జిల్లా పరిపాలన భవనం హాల్లో బళ్లారి జిల్లాపట్టణ స్థానిక సంస్థలతో పాటు ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. జనవరి 26న ఉదయం రాజ్‌కుమార్ పార్కులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం గవియప్పసర్కిల్లో 150అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం బళ్లారి మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తారు. బిమ్స్ మైదాన్ ఆవరణలో జిల్లా యంత్రాంగంచే నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం బళ్లారి నుంచి బెంగళూరుకు బయలుదేరి వెళతారని మంత్రి ప్రైవేట్ సెక్రటరీ మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

29న సమీక్షా సమావేశం

బళ్లారి సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం(కాట్పా)ని సమర్థవంతంగా అమలు చేయడంపై చర్చించేందుకు జిల్లా పొగాకు నియత్రణ సెల్ ప్రగతి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జనవరి 29న మధ్యాహ్నం నూతన జిల్లా పరిపాలనా భవనంలోని హాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా పొగాకు నియంత్రణ మండలి ఒక ప్రకటనలో తెలిపింది. జాతీయ పొగాకు నియంత్రణ సెల్ చైర్మన్‌గా ఉన్న డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేర్ ఉన్నారు.

క్లాక్ టవర్ ప్రారంభం ఎప్పుడో...?

బళ్లారి సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్లో ప్రజాపనుల శాఖ నిర్మించిన 110 అడుగుల క్లాక్ టవర్ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి గత నవంబర్ 2న ప్రారంభిస్తారని తొలుత ప్రకటించారు. దాని కోసం రాత్రి పగలు పనులు చేసి పూర్తి చేశారు. ప్రారంభోత్సవ తేదిని ముందుకు తరలించినప్పుడు,మిగిలిన పనులు పూర్తికాలేదు. ఇప్పుడు మళ్లీ రెండు నెలలు గడిచినా గాలికి టవర్ పై కప్పిన కవర్ చిరిగిపోయి దుమ్ము, ధూళి నిండిపోతోంది. ఈసర్కిల్ నుంచి దుర్గమ్మ గుడి రైల్వే అండర్ పాస్ వరకు రోడ్డు విస్తరణ కోసం గాంధీభవన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని ఎలాంటి మంజూరు, ముందస్తు టెండర్ లేకుండానే కార్పోరేషన్ క్లియర్ చేసింది. తదుపరి పెట్రోల్ బంకులో నిలుపుదల ఆర్డర్ తీసుకు రావడంతో ఈపని కూడా ప్రారంభం కాలేదు. టవర్ ప్రారంభించకపోవడంపై నగర వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



నగరంలోని క్లాక్ టవర్

స్నేహ బంధం చెడినట్లేనా..?

● గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు మధ్య పెరిగిన దూరం ● ప్రాణస్నేహితుల మధ్య భగ్గుమన్న విభేదాలు ● వ్యక్తిగతంగానే కాదు.. పార్టీకీ తీరని నష్టం



గాలి జనార్దన్ రెడ్డి, శ్రీరాములు (ఫైల్)

బళ్లారి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రాణ స్నేహితులమని చెప్పుకునే వారిద్దరి మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరని అందరూ అనుకునేవారు..కానీ పరస్పరం బురద జల్లుకునే పరిస్థితి రావడం సర్వత్రా ఆశ్చర్యం కలిగిస్తోంది. జనార్దన్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, శ్రీరాములు తాము నలుగురు సోదరులమని చెప్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఇప్పుడు సీన్ మారింది. ప్రాణ స్నేహితులు శత్రువులుగా మారారు. ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. అసలు వీరి స్నేహం చెడడానికి కారణం ఏమిటి.. అంటే ఇంత కాలం స్వార్థంతోనే కలిసిమెలసి తిరిగారా అన్న ప్రశ్నలు మొదలయ్యాయి.

శ్రీరాములు రాజకీయ అడుగులు..

1990 ముందు నుంచి శ్రీరాములు బళ్లారి రాజకీయాల్లో చురుగ్గానే ఉన్నారు. 1994 ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1996 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బళ్లారి ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించారు. కానీ అప్పటి సిటింగ్ ఎమ్మెల్యే ముండ్లూరు దివాకర్‌బాబు ఉండడంతో అప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ శ్రీరాములుకు దక్కలేదు. 1999 మధ్యకాలంలో కాంగ్రెస్ నుంచి శ్రీరాములు బీజేపీలో చేరారు. బళ్లారికి సుష్మస్వరాజ్ పోటీ తరువాత క్రమేపీ బీజేపీ బలపడింది.

సంకీర్ణంలో బ్రదర్సే కీలకం ..!

1999 వరకూ బళ్లారి మున్సిపాలిటీ కాంగ్రెస్ చేతిలో ఉంది. 2004లో లో బీజేపీ నుంచి 16 మంది దళం నుంచి ఇద్దరు కౌన్సిలర్లు గెలిచారు. అప్పుడు గాలి సోమశేఖర్‌రెడ్డి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2002 వరకూ జనార్దన్‌రెడ్డి బళ్లారిలో ఎన్నేబుల్ ఇండియా అనే ఫైనాన్స్ కంపెనీ నిర్వహిస్తుండేవాడు. తర్వాత మైనింగ్‌వైపు అడుగులు వేశారు. అప్పడే గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు స్నేహ బంధం బలంగా ఎదిగింది. 2008లో నియోజక వర్గం పెరిగి రూరల్ స్థానం ఎస్టీకి రిజర్వు కావడం వల్ల శ్రీరాములు బళ్లారి రూరల్ ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. బళ్లారి నగర ఎమ్మెల్యేగా గాలి సోమశేఖర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఇలా వీరందరూ బీజేపీ, దళం మిశ్రమ ప్రభుత్వంలో అధికారం అనుభవించారు. 2006లో యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో సంకీర్ణ ప్రభుత్వంలో అనిశ్చితి ఏర్పడింది. జేడీఎస్ కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని పట్టుపట్టారు. అప్పుడు రాజకీయ చాతుర్యతతో బళ్లారి బ్రదర్స్ తిరిగి యడియూర్పనే ముఖ్యమంత్రి చేశారు.

మైనింగ్‌తోనే బలపడ్డారు..

2004లో మైనింగ్‌తో రూ. వందల వేల కోట్లుకు పడుగులెత్తారు. జనార్దన్ రెడ్డి, శ్రీరాములు జోడిని ఎదురించాలంటే ఎవరితరం కాలేదు. ముఖ్యమంత్రులు సైతం వీరి అనుమతి లేకుండా బళ్లారి వచ్చే పరిస్థితి లేదన్నట్లు తయారయ్యింది. 2011లో లోకాయుక్త గాలి జనార్దన్‌రెడ్డిని అరెస్టు చేసింది. అప్పుడు బీజేపీ వదిలి గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు కలిసి బీఎస్ఆర్ పార్టీ స్థాపించారు. ఆ పార్టీ నుంచే కంప్లి సురేష్, గాలి సోమశేఖర్‌రెడ్డి, ఇలాకొందరు ఎమ్మెల్యేలుగా గెలిచారు. తరువాత దాన్ని మూసేసి తిరిగి బీజేపీలో చేరుపోయారు. జనార్దన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా శ్రీరాములు బళ్లారి నుంచి మైసూర్ వరకు పాదయాత్ర చేశారు. దాదాపు 40 నెలలు అంటే మూడున్నరేళ్ల గాలి జనార్దన్‌రెడ్డి జైల్లోనే ఉన్నారు. తరువాత 2015 జనవరి లో గాలి జనార్దన్‌రెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే బళ్లారి, కర్నూ లు, అనంతపురం జిల్లాలకు వెళ్లరాదని షరతులు విధించింది. 11 ఏళ్ల పాటు గాలి బళ్లారికి దూరంగానే ఉన్నాడు. అప్పడే శ్రీరాములు ఒక మాస్ లీడర్‌గా ఎదుగుతూ వచ్చారు. 1999 నుంచి అనేక సార్లు ఎమ్మెల్యే, ఎంపీగా గెలుస్తూ వచ్చారు. 2024లో జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో శ్రీరాములు ఓడిపోయాడు. గడిచిన నాలుగేళ్లగా శ్రీరాములు, జనార్దన్‌రెడ్డి మధ్య స్నేహం దూరమైతూ వచ్చింది. జనార్దన్‌రెడ్డి ఆస్తులు శ్రీరాములు, ఆయన అల్లుడు సురేష్‌బాబు, పేర్లతో ఉంచారు. జనార్దన్‌రెడ్డి జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత ఆస్తుల వివాదం పెరిగింది. బినామీ పేరుతో ఉంచిన తన ఆస్తులు తిరిగి ఇవ్వాలని జనార్దన్‌రెడ్డి అడిగితే సురేష్‌బాబు ఇవ్వలేదని గాలి అత్యంత సన్నిహితులతో పాటు జనార్దన్‌రెడ్డి కూడా ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తన మనస్సు నొప్పించేలా ప్రవర్తించారని గాలి పలుమార్లు పేర్కొన్నారు. ఎన్నికల గాలి కేఆర్‌పీపీ పార్టీ ప్రారంభించారు. అయితే ఎవరూ వెంట రాకపోవడంతో తిరిగి బీజేపీలోనే చేరారు.

సమస్య అంతా సండూరుతోనే..

సండూరు ఉప ఎన్నికల బీజేపీ ఓటమికి శ్రీరాములు కూడా ఒక కారణం అనేది ఇప్పుడు వివాదానికి దారి తీసింది. వాస్తవానికి సండూరు కాంగ్రెస్ కంచుకోట.. అక్కడ సంతోష్ లాడ్ లాంటి కాకలు తీరిన రాజకీయ నాయకులూ ఉన్నారు. అంతే కాకుండా జనార్దన్‌రెడ్డి బలపడిచే వ్యక్తి బంగారు హనుమంత ను గెలిపిస్తే తిరిగ జనార్దన్‌రెడ్డి హవా సండూరుపై పడుతుందని, మైనింగ్ యజమానులంతా ఏకమై బీజేపీని ఓడించారు. ఇందులో శ్రీరాములు తప్పేముందని కొందరు ప్రశ్నిస్తున్నారు. రెండు మూడు రోజులుగా గాలి , శ్రీరాములు బహిరంగ సవాళ్లతో బీజేపీలో కలకలం రేపుతోంది. వీరి గొడవలు పార్టీకి నష్టం తెస్తాయని పలువురు భావిస్తున్నారు. అన్నదమ్ములమని చెప్పుకునే వీరు ఎందుకిలా బజారున పడ్డారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ బాలికా దినోత్సవం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కృష్ణ

బళ్లారి సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికల్ కాలేజీ, పీడియాట్రిక్స్ విభాగం, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, బళ్లారి శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంస్థ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, విభాగాధిపతి డా.విశ్వనాథ్ మాట్లాడుతూ 2008 నుంచి దేశవ్యాప్తంగా జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బాలికలకు సమాన విద్యప్రోత్సాహం, అవకాశాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ మంజునాథ్ మాట్లాడుతూ తన వ్యక్తిగత జీవితంలోనూ, వృత్తి జీవితంలోనూ గమనించినట్లుగా వృద్ధులైన తల్లిదండ్రులను ఎంతో శ్రద్ధగా చూసుకునేది ఆడపిల్లలేనని, తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు ఆడపిల్లల్లోనే కనిపిస్తాయన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇందుమతి మాట్లాడుతూ నేటితరం ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించగలరనడానికి తానే ఉదాహరణ అని , తాను సూపరింటెంటెఅయిన రోజునే ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బళ్లారిలోని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ హెగ్డే, సెక్రటరీ డాక్టర్ జగదీశ్ పాల్గొన్నారు.

ముగిసిన అసోసియేషన్ ఎన్నికలు



విజేతలను అభినందిస్తున్న సభ్యులు

బళ్లారి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్పాంజ్ ఐరన్ మాన్యుఫ్యాక్చర్స్ అసోషియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగినట్లు అసోషియేషన్ తెలిపింది. అధ్యక్షుడిగా సాయిప్రసాద్‌రెడ్డి, సెక్రటరీగా ఎస్పీ వెంకటేష్, ట్రెజరర్ కే. యల్లయ్య, గౌరవ అధ్యక్షుడు టీ. శ్రీనివాస్‌రావు, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఇ. శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్లుగా ఆర్‌వీ ఓంకార్, సాలా హనుమంతరెడ్డి, జాయింట్ సెక్రెటరీ కోటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా పీ.వీ.ఎస్. రావు, జులియన్ జాలన్, కైలాశ్ వైయాస్, ప్రతీక్ అగర్వాల్, వెంకటరమణ ఎన్నికైనట్లు కమిటీ తెలిపింది. అనంతరం వీరు మాట్లాడుతూ స్పాంజ్ కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రభుత్వంతో కలిసి చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

కంప్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో కూడ్లిగిలో శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం సీపీఎం పార్టీ ప్రముఖుడు ఈరన్న మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కార్యకర్త సహాయకురాలు వేతనాలు పెంచాలని నిరసన చేపట్టిన విషయం తెలిసింది. కానీ మంత్రులు, ముఖ్యమంత్రులు విధానసభ సమావేశంలో చర్చించి ఆమోదం తీసుకుని వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు గానీ ఇంతవరకు, చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ సహాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయానికి పాదయాత్ర



పాదయాత్రగా బయల్దేరుతున్న భక్తులు

సిరుగుప్ప, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టెక్కలకోట పట్టణానికి చెందిన వందలాది మంది భక్తులు మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి పాదయాత్రగా బయల్దేరారు. శుక్రవారం పూజలు నిర్వహించి పాదయాత్రగా బయల్దేరారు. సిరుగుప్ప, అచ్చొళ్లి, కౌతాళం, హాల్వి, మాధవరం నుంచి మంత్రాలయం వెళుతున్నట్లు తెలిపారు. ఏటా మొక్కులు తీర్చుకుంటున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వద్దు: డీహెచ్ఓ

కంప్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : గర్భిణీలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయరాదని జిల్లా ఆరోగ్య శాఖాధికారి రమేష్ బాబు సూచించారు. జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మాతృ సురక్ష అభియాన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు 9వ తేదీన, 24వ తేదీన తప్పనిసరిగా ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బసవరాజు, భాగ్య లక్ష్మీ, పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ, కౌసర్, వెంకటరమణ బాబు, చంద్రయ్య దొడ్డ బసప్ప, తిమ్మప్ప, జంగ్లీ సాబ్ సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయ్ నాగరాజు

వృద్ధులకు కంటి పరీక్షలు

బళ్లారి రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): షిర్డీసాయి సేవా సత్సంగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బళ్లారి నగరం వడ్రబండ బలిజ భవన్, లక్ష్మీదేవి, లింగన్న కళ్యాణమండపంలో చేపట్టిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి భారీగా వృద్ధులు తరలివచ్చారు. షిర్డీసాయి సేవా సత్సంగం 24వ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు ఆర్ గోపాలకృష్ణ, డాక్టర్ నాగరాజు కుమారుడు, డాక్టర్ విజయ నేతృత్వంలో కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహించారు. దాదాపు 400 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి గోవిందరాజులు, సహ కార్యదర్శులు కొండయ్య, ఎం రమేష్ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సిబ్బంది వాసు, తాహిర్, షమీమ్, జెట్లీ రఫీక్, ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలు తొలగిస్తున్న అధికారులు

గంగావతి రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధిలో భాగంగా పలు అక్రమ కట్టడాలను అధికారులు తొలగించారు. 15వ ఆర్థిక ప్రణాళిక క్రింద కారటిగి పట్టణంలోని 6,7 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా రెండు వార్డుల్లో ఆక్రమణలు తొలగించేందుకు శుక్రవారం కారటిగి పురసభ శ్రీకారం చుట్టింది. పురసభ ముఖ్య అధికారి సురేష్, సభ్యులు హీరే బసప్ప అక్రమకట్టడాలను దగ్గరుండి తొలగించారు. పురసభ చీఫ్ ఆఫీసర్ సురేష్ మాట్లాడుతూ ప్రజలు తిరగడానికి లేనంతగా క్రమ కట్టడాలు మితిమీరి నిర్మించడంతో తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. పట్టణాభివృద్ధికి రూ 36.9లక్షలు, 15వ ఆర్థిక ప్రణాళిక పథకం క్రింద రూ 15లక్షలు నిధులతో కారటిగి పట్టణంలో అభివృద్ధి పనులు చేబడుతున్నట్లు వివరించారు. పట్టణంలోని 1, 2, 3, 5 వార్డులతో పాటు ఆక్రమణలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. అభివృద్ధి పనులకు కారటిగి పట్టణ ప్రజలు సహకరించాలని పురసభ ముఖ్య అధికారి కోరారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అధ్యక్షుడు బట్టాప్రసాద్, ఉపాధ్యక్షురాలు సుశీలమ్మ

కంప్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కంప్లి పురసభ నూతన అధ్యక్షుడు బట్టా ప్రసాద్, ఉపాధ్యక్షురాలు సుశీలమ్మ శుక్రవారం పురసభ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఉదయం కార్యాలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే నేతృత్వంలో పూజలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ పట్టణంలో సమస్యలు తలెత్తకుండా చూసినప్పుడే పదవికి న్యాయం చేసిన వారమవుతారమన్నారు. ముఖ్యంగా వేసవిలో నీట సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. నూతన అధ్యక్షుడు బట్ట ప్రసాద్ మాట్లాడుతూ ఇకపై వార్డులో ఏ సమస్య వచ్చినా నేరుగా తెలపాలన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరిం చాలన్నారు. ఇకపై ప్రతిరోజూ ఉదయమే వార్డులో తిరుగుతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. వార్డుల్లో విద్యుత్ లైట్లు, తాగునీరు, రోడ్లు, మురికి కాలువల పరిశుభ్రతలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పట్టణ ప్రజలకు మ్యుటేషన్ ఫారం త్రీ, ఇతర సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారి దుర్గన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని దహనం చేసిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయి(ఫైల్)

గంగావతి రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పలు దాడుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని పోలీసులు మంటల్లో కాల్చేశారు. కొప్పళ జిల్లాలో ఎన్‌డీపీఎస్ చట్టం క్రింద జప్తుచేసిన 62.479 కిలోల గంజాయి నిల్వలను కొప్పళ జిల్లా పోలీసులు శుక్రవారం దహనం చేశారు. 2000, 2008, 2009, 2012,2013 సంవత్సరాల్లో గంజాయికి సంబంధించి జిల్లాలో ఆరు కేసులు నమోదు కాగా, జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మెన్‌గా ఉన్న జిల్లా పోలీసు సూపరిండెంట్ డాక్టర్ రామ్.ఎల్. అరసిద్ధి ఆధ్వర్యంలో తాలూకాలోని నాగేషనహళ్ళి బయోమెడికల్ వేస్ట్ డిస్పోజల్ కేంద్రంలో జప్తు చేశారు. డీవైఎస్పీ ముత్తణ్ణ సవరగోళ, సైబర్ పోలీసు స్టేషన్ డీఎస్పీ యశ్వంతకుమార్, వాతావరణ కాలుష్య నియంత్రణ అధికారి వై.ఎస్. హరిశంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసనకారులతో చర్చిస్తున్న కమిషనర్ ప్రమోద్

కంప్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కురుగోడు సమీపంలోని సిరిగేరి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలంటూ గత నాలుగైదు రోజులుగా గ్రామ ప్రజలు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ శుక్రవారం సిరిగేరి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు రాంబాబు, లక్ష్మణ భండారి, హనుమేష్, హనుమంతు తదితరులు మాట్లాడుతూ గ్రామంలో నడిబొడ్డున చెరువు ఉండడం వల్ల ప్రజలు రోగ్యానికి గురవుతున్నారని, ఈ విషయం పైన ఎన్నిసార్లు పంచాయతీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే గ్రామంలో మురికికాలువలు లేక రోడ్లపైనే మురుగునీరు పారుతుండటంతో పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, రైతులు మురుగునీటిలోనే నడవాల్సి వస్తోందన్నారు. వెంటనే గ్రామంలో చెరువు పరిశుభ్రం చేపట్టి కంప్లి సోమప్ప చెరువు తరహాలో కంచె ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ మాట్లాడుతూ సమస్యలపై చర్చించి పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, అనుమేష్, నాగరాజు, బసవరాజు, వీరేష్, ఉలిగప్ప, కుమార్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

బస్‌స్టాప్ లేక ఇబ్బందులు



కేసీసీ నగర్ కూడలి

హోసూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాగలూరు జాతీయ రహదారి మార్గంలో కేసీసీ నగర్ ఉంది. ఈ రహదారి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రానికి అత్యంత ముఖ్యమైన రవాణా రహదారి. కేసీసీ నగర్ ప్రాంతంలో వెయ్యి కుటుంబాలకుపైగా నివసిస్తున్నారు. ఈ కూడలి మీదుగా టౌన్ బస్సులు, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తున్నాయి. కానీ కేసీసీ నగర్ ప్రాంతంలో బస్సులు ఆగవు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కేసీసీ నగర్ జంక్షన్‌కు అర కిలోమీటరు దూరంలో ఆర్టీఓ చెక్‌పోస్టు ఉంది. ఎన్‌జీజీఓఎస్ కాలనీల్లోనే బస్సులు ఆగుతాయి. వందలాదిమంది ఉంటున్న కేసీసీ నగర్ ప్రాంతంల్లో బస్టాప్ నిర్మించి, బస్సులు ఆపేలా చర్యలు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

లంచం అడిగిన అధికారిపై చర్యలు

హోసూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బర్గూరు జిల్లా కార్యాలయంలో పట్టా మార్పిడి కోసం లంచం డిమాండ్ చేసిన అధికారిపై ఏసీబీ అధికారులు దాడి చేసి అరెస్టు చేశారు. పట్టా మార్పిడి ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన తర్వాత దళారి ద్వారా సర్వేయర్ లంచం డిమాండ్ చేస్తున్నాడనే ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. దీంతో సర్వేయర్‌ను, దళారిని అరెస్టు చేసినట్టు అవినీతి నిరోధకశాఖ అధికారులు ప్రకటించారు.

కాటేసిన పాముతో ఆసుపత్రికి..

హోసూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని సప్పడి గ్రామానికి చెందిన రవి(35) స్థానికంగా ఓ హోటల్‌లో పని చేసేవాడు. శుక్రవారం హోటల్ దగ్గర మొక్కలు, తీగలను శుభ్రం చేసే పనిలో ఉండగా ఒక చిన్న కట్ల పాము మొక్కల మధ్యలోనుంచి వచ్చి రవిని కాటివేసింది. వెంటనే కోపంతో రవి ఆ పామును చంపి ఒక సంచిలో వేసుకుని కామన్‌దొడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లమని సూచించారు. ఆ తర్వాత తన స్నేహితుడితో కలిసి చనిపోయిన పామును తీసుకుని హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. ఘటన వివరాలను వైద్యుడికి వివరించగా చికిత్స అందించారు. అతడికి పాము కాటువేయడంతో పెను ప్రమాదం లేదని, ఒక్క రోజు ఆసుపత్రిలో ఉండాలని సూచించారు. అనంతరం హోసూరు ప్రభుత్వాసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చారు. తనను కాటేసిన విషపూరిత పామును తీసుకొచ్చానని చూపించాడు. అక్కడి ప్రజలు, వైద్యులు దిగ్భ్రాంతి చెందారు.

పేరు మార్పుపై నిరసన



గుమిగూడిన స్థానికులు

హోసూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని వా.వూ.సీ నగర్, మునీశ్వర నగర్ రింగు రోడ్డు జంక్షన్‌కు కార్పొరేషన్ తరఫున తంథై పెరియార్ అని నామకరణం చేస్తూ ప్రభుత్వం ఆదేశం మేరకు ఇటీవలే అక్కడ నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. దీన్ని తీవ్రంగా నిరసిస్తూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చాలాకాలంగా వాడుకలో ఉన్న నామఫలకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నేమ్ బోర్డును తొలగించి మునీశ్వర నగర్ సర్కిల్ నేమ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీతో పాటు హిందూ సంఘాలు, ప్రాంత వాసులు నిరసనకు దిగారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా చేరుకున్నారు. ఏటీఎస్పీ నమశివాయం, ఏఎస్పీ అక్షయ్ అనిల్ వాగ్రే, డీఎస్పీలు మురళీ, సింధు, ఇన్‌స్పెక్టర్‌తో పాటు 90 మందికి పైగా పోలీసులు మొహరించారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాలకు చెందిన పలువురు నిరసనకు దిగారు. నాగరాజు మాట్లాడుతూ నేమ్‌బోర్డును తెరవడంపై కార్పొరేషన్ సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని, ఈ విషయంలో ప్రజలు నుంచి ఎలాంటి అభిప్రాయం తీసుకోలేదని ఆరోపించారు. పోలీసుల జోక్యంతో నిరసనకు తెరపడింది.



బందోబస్తులో పోలీసులు